క్లుప్తంగా

నేడు ఉప సర్పంచ్ ఎన్నిక

రాజానగరం: పాతతుంగపాడు ఉపసర్పంచ్ పదవికి ఈ నెల 27న ఎన్నిక జరుగనుంది. పంచాయతీ కార్యాలయంలో విస్తర్ణాధికారి సమక్షంలో ఈ ఎన్నిక జరుగుతుందని ఎంపీడీఓ జెఎ ఝాన్సీ తెలిపారు.

నేడు ఉపసర్పంచ్ ఎన్నిక

సీతానగరం: మునికూడలి పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక గురువారం ఉదయం నిర్వహిస్తామని ఈవోపీఆర్డీ కేవిఎస్ఎస్ మూర్తి తెలిపారు. బుధవారం ఈవోపీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి మునిదీప్తిలు విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ 3వ వార్డు మెంబర్ ముప్పిడి సురేష్ గతంలో ఉపసర్పంచ్‌గా ఉండేవారన్నారు. ఆయన రాజీనామా చేయడంతో ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అయితే పంచాయతీ ఉపసర్పంచ్‌గా నాలుగో వార్డు మెంబరు ఆనిమిల్లి సత్యవేణిని ఎన్నికునే అవకాశం ఉందని సమాచారం.

గోలింగేశ్వరస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

బిక్కవోలు: గ్రామంలో కొలువైన ఉన్న గొలింగేశ్వరస్వామి, పార్వతీదేవి వార్షిక కల్యాణం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

నేడు ఎంపీపీ ఎన్నిక

బిక్కవోలు: మండలంలోని ప్రజా పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) కోసం గురువారం ఎన్నికలు నిర్వహించనున్నట్టు అని ఎంపీడీవో శ్రీనివాస తెలిపారు. 20 మంది వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలతో కొవ్వూరి జ్యోతిర్మయి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారు. అయితే సార్వత్రిక ఎన్నికలు తరువాత ఆమె పదవికి రాజీనామా చేయడంతో ఇప్పటివరకు వైస్ ఎంపీపీ అయిన బుద్దాల కన్నారావు ఇన్‌చార్జి ఎంపీపీగా నియమించారు. ఈ నెల 27వ తేదీన ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాటు పూర్తయ్యాయి. వైఎస్సార్ సీపీ తరుపున బలభద్రపురం గ్రామానికి చెందిన సబ్బెళ్ల సుజాత, కూటమి అభ్యరిగా తొస్సిపూడి గ్రామానికి చెందిన తేతలి సుమ పోటీ పడనున్నారు.

లక్ష్మీగణపతి హుండీ లెక్కింపు



బిక్కవోలులో హుండీలు లెక్కిస్తున్న భక్తులు, పెద్దలు

బిక్కవోలు: గ్రామంలో లక్ష్మీగణపతిస్వామి, గోలింగేశ్వరస్వామి దేవాలయాల్లో గల హుండీలను బుధవారం లెక్కించినట్టు ఆలయ కార్యనిర్వాహణ అధికారి రామలింగ భాస్కర్ తెలిపారు. దేవదాయ శాఖ రామచంద్రాపురం వారి పర్యవేక్షణలో, గ్రామ పెద్దలు, భక్తులు సమక్షంలో ఈ లెక్కింపు నిర్వహించామన్నారు. లక్ష్మీగణపతి హుండీ ద్వారా రూ.10,97,441, గోలింగేశ్వర స్వామి హుండీ ద్వారా రూ.3,93,859 వచ్చాయన్నారు. సుమారు మూడు నెలల ఇరవై రోజుల కాలానికి ఈ ఆదాయం వచ్చినట్టు తెలిపారు.

పదోతరగతి ఫిజికల్ సైన్సు పరీక్షకు 571 హాజరు

బిక్కవోలు: మండలంలోని పదోతరగతి పరీక్షలు భాగంగా బుధవారం ఫిజికల్ సైన్సు పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 571 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండలంలోని బిక్కవోలు, బలభద్రపరం, పందలపాక కేంద్రాల ద్వారా 578 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. కానీ ఏడు మంది గైర్హాజరయ్యారని బిక్కవోలు ఎంఈవో-1 సీహెచ్ సత్యనారాయణ తెలిపారు.

577 మంది హాజరు

రంగంపేట: మండలంలోని రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి పబ్లిక్ భౌతిక శాస్త్రం పరీక్ష జరిగినట్టు మండల విద్యా శాఖాధికారి పి.మధుసూధనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు కేంద్రాల్లోను మొత్తం 581 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 577 మంది హాజరయ్యారని తెలిపారు. రంగంపేటలో 212 మందికి 210, వడిశలేరులో 185 మందికి 184, సింగంపల్లిలో 184 మందికి 183 మంది పరీక్షలు రాసినట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు చెప్పారు.

చేతి వృత్తులకు ప్రోత్సాహం

కడియం: చేతి వృత్తులకు తమ కూటమి ప్రభుత్వం ప్రోత్సాహాన్నిస్తుందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. ఆదరణ 3 పథకం అవగాహన కార్యక్రమం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోరంట్ల మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీవో రమేష్, ఉపాధ్యక్షులు పంతం గణపతి, కలిదిండి విశాలాక్షి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కవర్ చేస్తే లాభాలు

- కవర్లు తొడగడం వల్ల మామిడి దిగుబడి బాగు
- తెగుళ్లు దూరం
- కోరుకొండ మండలంలో 1,250 హెక్టార్లలో సాగు

మధురపూడి: ప్రస్తుతం మామిడి తోటలు పందె దశలో ఉన్నాయి. పంట ఆశాజనకంగా ఉన్నా మంచు కారణంగా పిందె మొత్తం నేల రాలుతోంది. రైతులు మామిడిని కాపాడుకునేందుకు రకరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కాయల దశలో వీటికి కవర్ల తొడిగితే నాణ్యతతోపాటు, పోషకాలు గల పండ్లు తయారవుతాయి. మెట్టప్రాంతమైన రాజానగరం, అనపర్తి నియోజకవరగాల్లో 2.997 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి తోటలున్నాయి. రాజానగరం నియోజకవర్గంలో 2,434 హెక్టార్ల విస్తీర్ణం కాగా, అనపర్తిలో 563 హెక్టార్లలో మామిడితోటలున్నాయి. ఈ ప్రాంతంలోని మామిడిపండ్లు రుచికి కేఆర్ఆఫ్‌గా నిలుస్తాయి. ఎర్రనేలలు కావడంతో రుచికరమైన పండ్లు దొరుకుతాయి. అయితే తెగుళ్లు, పుచ్చులు, మచ్చలను ఎదుర్కొలేక, ఫక్వానికి వచ్చే దశలోనే కాయలు నేలరాలిపోతున్నాయి. దీనిని నివారించడానికి కాయలకు కవర్లు తొడగడం ద్వారా నస్టాల నుంచి లాభాల వైపునకు వెళ్లొచ్చని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు.

రాజానగరం నియోజకవర్గంలో

నియోజకవర్గంలో 2,434 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి తోటలున్నాయి. ఇవి కోరుకొండ మండలంలో 1,250 హెక్టార్లుండగా, రాజానగరం మండలంలో 1,0 50 హెక్టార్లు, సీతానగరం మండలంలో 134 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి పంట పండుతోంది. ఈ సంవత్సరం దిగుబడి పెరగాలని రైతన్నలకు ఆశిస్తున్నారు. ఇప్పటికే సస్యరక్షణ పనులు నిర్వహిస్తున్నారు. వీటి సంరక్షణలో భాగంగా కాయలకు కవర్లు తొడుగుతున్నారు. గ్రామాల్లో తొడుగుతున్న పనులు జోరందుకున్నాయి.

నాణ్యమైన దిగుబడికి బాగు

మామిడి కాయలకు కవర్లు తొడగడం చాలా ఉపయోగకరం, దీనివల్ల నాణ్యమైన దిగుబడి, ఆశాజనకమైన లాభాలనుపొందవచ్చును. కాయకుండే సహజ లక్షణాలను పెంచి, తొడిమ ధృడంగా తయారయ్యి, పెద్ద కాయలు దిగుతాయి. కాయ పరిణామం పెరగడంతో మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది. సంచులు కట్టడంతో కోసినకాయలు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. సంచులుండడంతో అధిక సూర్యరష్మి, వడగండ్లు వానల నుంచి కాయలను కాపాడుకోవచ్చు. పురుగు మందులు వాడాల్సినవసరంలేదు. మచ్చలు, మంగు, తేనే మంచు పురుగు, ముడ్డి పుచ్చు, టెంకపురుగు వంటి తెగుళ్ల వ్యాపించవు. మామిడి దిగుబడికి అవరోధంగా ఉన్న పండు ఈగ, త్రిప్స్ వంటి పురుగుల వల్ల నష్టాన్ని అరికడుతోంది.

పిందె దశలో కవర్లు తొడగాలి

మామిడి కాయలకు పిందె దశలోనే కవర్లు తొడగాలి. నిమ్మకాయ, కోడిగుడ్డు పరిమాణంలో ఉన్నపుడే కట్టాల్సి ఉంటుంది. మంచి పిందెలను సంచిలో జాగ్రత్తగా పెట్టి, గాలి చొరబడకండా పైన తొడిమకు సంచికి ఉండే తీగను కట్టాలి. సంచి కట్టిన 40-50 రోజుల తర్వాత కాయలను కోసుకోవచ్చు.

రకాలు ఇవీ..

మామిడి కాయలలో వివిధ రకాలు ఉన్నాయి. వాటిలో బంగినపల్లి, పెద్ద రసాలు, చెరకు రసం, హైదర్ సాహెబ్, పంచదార కల్తీ, కొత్తపల్లి కొబ్బరి తదితర రకాలున్నాయి. వీటిలో రుచికి మారుపేరుగా బంగిన పల్లి, రసాలు, కొత్తపల్లి కొబ్బరి ఉంటాయి. అలాగే ఆవకాయ పచ్చడికి కొత్తపల్లి కొబ్బరి, రసాలు, హైదర్‌సాహెబ్ కాయలను ఉపయోగిస్తారు.



నర్సాపురంలో మామిడి కాయలకు సంచులు తొడిగిన రైతులు



బూరుగుపూడిలోని పెద్ద మామిడి తోట



నర్సాపురం గ్రామంలో మొక్క తోటల్లో మామిడి కాయలకు కవర్ల తొడుగులు

పిందె దశలో కవర్లు కట్టాలి



మామిడి కాయలకు పిందె దశలోనే కవర్లు తొడగాలి. నిమ్మ కాయ, కోడిగుడ్డు పరిమాణంలో ఉన్నపుడే కట్టాలి. మంచి పిందెలను సంచిలో జాగ్రత్తగా పెట్టి, గాలి చొరబడకండా పైన తొడిమకు సంచికీ ఉండే తీగను కట్టాలి. సంచి కట్టిన 40-50 రోజుల తర్వాత కాయలను కోసుకోవచ్చు. అలాగే ఈ పక్రియలో మామిడిరైతులకు ప్రభుత్వం సహాయాన్ని అందజేస్తుంది. సంచి ఒక్కొక్కటికి రూ.2 లుండగా, 50 శాతం రాయితీనిని ప్రభుత్వం అందిస్తోంది. దీని ద్వారా ఒక్కో రైతుకు హెక్టారుకు రూ.10 వేల రాయితీగా పొందవచ్చును.

– రినీ, ఉద్యానశాఖ అధికారిణీ, కోరుకొండ

నాణ్యమైన దిగుబడి



మామిడి కాయలకు సంచులు తొడగం ద్వారా నాణ్యమైన దిగుబడి అందడంతోపాటు పెరుగుతోంది. దీంతో గతం కంటే ఉత్పత్తి పెంచుకోవడానికి వీలవుతోంది. తేనే మంచు, గుద్ద పుచ్చు కారణంగా కాయలు నేలరాలిపోతున్నాయి. అలాగే పురుగులు ఆశించి కాయ ఫక్వానికి రాకుండానే పాడువుతోంది. దీనికి నివారణగా సంచులు తొడిగే కార్యక్రమం ఉంటుంది. ఎకరం తోటకు సాధారణంగా 6 టన్నులు దిగుబడి జరగాలి. కాని తెగుళ్లు, పురుగులు ఆశించడంతో ప్రతి సంవత్సరం 3 టన్నులకు మించడం లేదు

-బుద్దిగ సత్తిబాబు, మామిడి రైతు, బూరుగుపూడి.

బాలికల రక్షణకే పోక్సో చట్టం



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజానగరం: బాలికల సంరక్షణ కోసం పోక్సో చట్టం ఉందని, 18 సంవత్సరాలలోపు అమ్మాయిలపై ఎటువంటి దాడులు జరిగిన ఈ చట్ట ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోక్సో చట్టం (లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టం) పై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. చిన్న పిల్లలు చదువుపైనే దృష్టిని కేంద్రీకరించాలని, ఎటువంటి ఆకర్షణలకు, ప్రలోభాలకు లోను కావొద్దన్నారు. సమాజంలో మంచి, చెడులను గ్రహిస్తూ, మీరు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకుని, ఉన్నత స్థాయిలో స్థిరపడేలా ప్రయత్నించాలని సూచించారు. ఏవిధమైన సమస్య వచ్చినా తల్లిదండ్రులకు చెప్పడంతోపాటు వాటిని మనోధైర్యంతో ఎదుర్కొనేందుకు సిద్ధం కావలన్నారు. తొమ్మిదేళ్లు నిండిన ఆడపిల్లలను అమ్మ దగ్గరనే ఉంచాలన్నారు. అంతేకాకుండా ఈ వయస్సు నుంచి తల్లిదండ్రులు నిరంతరం తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని, ముఖ్యంగా మొబైల్ ఫోన్లలో వీడియోల చూడడంపై పరిశీలించాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి పి.విజయకుమారి మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల గుడ్ టచ్, బేడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరికి వారే ఆత్మరక్షణతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ టి.నాగమణి, అడ్వకేట్ జి.దేవిభవాని, సూపర్‌వైజర్లు ఎన్‌కే దుర్గామణి, ఎన్.భూదేవి, ఎస్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

రాయవరం: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తేనే మంచి గుర్తింపు లభిస్తుందని జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా పేర్కొన్నారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన హిందీ పండిట్ పడాల సత్యనారాయణరెడ్డి ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యకమం హెచ్‌ఎం సునీత అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలు స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. మూడు దశాబ్దాలుగా సత్యనారాయణరెడ్డి అందించిన సేవలను ఆయన ప్రశంసించారు. సమావేశంలో రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి, ప్రముఖ వైద్యులు డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి, సర్పంచ్‌ల సమాఖ్య మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం సత్యనారాయణరెడ్డి, అరుణకుమారి దంపతులను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డీఈవో డాక్టర్ సలీం బాషా తదితరుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు కొవ్వూరి సత్యనారాయణ రెడ్డి గారు(సత్తి బాబు), తేతలి సుబ్బిరామిరెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, స్థానిక నేత ఉండవల్లి రాంబాబు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని, ఎంఈవో వైవీ సూర్యనారాయణ తదితరులు చేతుల మీదుగా గజమాల, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సత్యనారాయణరెడ్డి, అరుణకుమారి దంపతులను సత్కరిస్తున్న డీఈవో డాక్టర్ సలీం బాషా తదితరులు

ఘనంగా బైబిలు మిషన్ మహాసభలు

రాజమహేంద్రవరం రూరల్: రాజమండ్రి శానిటోరియం దగ్గర బైబిలు మిషను 58వ మహాసభలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. బైబిలు మిషను ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఎన్.విజయరాజు ప్రారంభ ప్రార్థన చేసి మహాసభలను ప్రారంభించారు. కేథడ్రల్ సభ్యులు, గోల్డెన్ జూబిలీ మందిర విశ్వాసులు, స్వస్థత శాల సభ్యులు బైబిల్ మిషన్ తెలుగు క్రైస్తవ కీర్తనలు ఆలపించారు. డాక్టర్ ఎస్.వి జయరాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు సిలువ శ్రమ కాలంలో క్రైస్తవులందరూ మహాసభలకు చేరి సిలువ ధ్యానంలో పాలు పంచుకోవాలని సూచించారు. ఏసుక్రీస్తు మార్గమే మోక్షానికి మార్గమని ఉపదేశించారు. రెవ.సుదర్శనరావు ప్రారంభించిన బైబిల్ మిషను మహాసభలు ప్రతి ఏడాది దేవుని మహిమ అర్థమే జరుగుతున్నాయని తెలియజేశారు. ఈ సందర్భంగా బైబిలు మిషను అధికారులు రెవ.డి.షాలేంరాజు, రెవ.పీజే సుధాకర్, రెవ.డి.సువర్ణ రాజు రెవ.డాక్టర్ ఎన్.సిమ్యోన్ సుదర్శన్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రెవ.ఎన్.విలియం బెంటిక్, ఎన్.ఉషారాణి, పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



ప్రార్థన ఆశీర్వాదాలు అందిస్తున్న రెవ విజయరాజు

ఎస్సీ యువతకు ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీ యువతీ యువకులకు పీఎంఏజేవై పథకం ద్వారా ఏపీఎస్ఎస్‌డీసీ, ఎస్సీకార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణను బొమ్మూరులోని నేక్‌లో ఇవ్వనున్నట్టు నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్స్ డిప్యూటీ డైరెక్టర్, నోడల్ ఆఫీసర్ పి.మురళీధర్ అన్నారు. బుధవారం నేక్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మురళీధర్ మాట్లాడుతూ గురువారం ఉదయం నాక్ బొమ్మూరు అధికారులతో జరిపిన సమావేశంలో ఎస్సీ యువతీ యువకులకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డోమెస్టిక్ ఐ.టీ హెల్ప్ డెస్క్ అసిస్టెంట్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్, అసిస్టెంట్ హెయిర్ స్టైలిస్ట్ కోర్స్‌ల్లో బొమ్మూరు నేక్‌లో త్వరలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 18 నుంచి 45 ఏళ్లలోపు ఉంది పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, 4 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, వారి పేరుపై ఉన్న బ్యాంకు పాస్ బుక్ మొదటి పేజీల జిరాక్స్ కాపీలతో నేక్‌లో సంప్రదించి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలు అసిస్టెంటు డైరెక్టర్ జే.రాజు 98664 43303 నంబరును సంప్రదించాలన్నారు. ఈ ఉచిత శిక్షణలో మధ్యాహ్న భోజనం, రెండు పర్యాయాలు స్నాక్స్ ఇస్తూ శిక్షణానంతరము ప్రసిద్ధ కంపెనీలలో ఉద్యోగ కల్పనతోబాటు కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్నారు. ఈసమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలో నీటి కొరత నివారణకు చర్యలు

వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: యూనివర్సిటీ ప్రాంగణంలో నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు ప్రాంగణాన్ని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ×నీటి సంరక్షణ, భవిష్యత్తు సవాళ్లు¥ అనే అంశంపై బుధవారం నేషనల్ వర్క్‌షాప్ జరిగింది. చిన్నతనంలో రాబోయే కాలంలో నీటిని కొనుక్కుంటారు అంటే నవ్వుకునేదాన్ని, కానీ ఇప్పుడు మనమంతా గోదావరి చెంతనే ఉన్నా గుక్కెడు మంచినీటిని కూడా పొందలేకపోతున్నామన్నారు. ముఖ్యంగా యూనివర్సిటీ ప్రాంగణంలో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా ఎదుర్కొనే విధంగా అనుభవజ్ఞుల సహకారంతో అవసరమైన కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. నీటి సంరక్షుడిగా పేరొందిన సిద్ధినబోయిన వెంకటయాదవ్ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో ఎవరికివారు ఇష్టానుసారంగా బోర్లు వేసి, భూగర్భ జలాలను తోడేయడంతోనే నీటి సమస్య ఎదురవుతుందన్నారు. వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా ఒక లక్ష యాభైవేల లీటర్ల నీటి సామర్థ్యంతో కూడిన సంప్‌ను ఏర్పాటు చేసి, దానిపై ఇంటి నిర్మాణం చేశానన్నారు. నేడు ఇది ఎందరికో ఆదర్శంగా నిలిచిందన్నారు. నీరే కదా అని వృథాగా వాడేయరాదని, నీటి వాడకంలోను పొదుపును పాటించాలన్నారు. ఆ విధంగా అంతా జాగ్రత్తలు తీసుకుంటేనే భావితరాలకు నీటి కొరత రాకుండా ఉంటుందన్నారు. ఈ మేరకు విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, యూనివర్సిటీ ఇంజినీర్ డాక్టర్ కె.నూకరత్నం, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

నర్సరీ రైతుల కళాత్మక దృష్టి అద్భుతం

కడియం: నర్సరీ సాగు అనేది పర్యావరణానికి మేలు చేసేదే కాకుండా రైతుల కళాత్మక దృష్టితో చేసేదని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ అన్నారు. బుధవారం స్థానిక పల్ల వెంకన్న నర్సరీని ఆయన సందర్శించారు. నర్సరీ అధినేత పల్ల సుబ్రహ్మణ్యం ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఖైదీల సహకారంతో మొక్కలను పెంచుతున్నామన్నారు. దీనికి నర్సరీ రైతుల తోడ్పాటు అవసరమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ యం. రాజ్‌కుమార్, పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

గోదావరి నదిలో దూకి యువకుడి గల్లంతు



మునస వీరబాబు (ఫైల్)

రాజానగరం/కొవ్వూరు: కుటుంబ పోషణలో తండ్రికి తోడుగా ఉంటున్నారనుకుంటున్న ఇద్దరు కొడుకులలో ఒకడు రాజమహేంద్రవరం, గోదావరిలోకి దూకేశాడని తెలిసిన ఆ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రోజులాగే బుధవారం ఇంటి నుంచి వెళ్లిన చిన్నకొడుకు ఆచూకీ తెలియక వారు తల్లడిల్లిపోతున్నారు. రాజానగరం కొత్తకాలనీలో నివాసం ఉంటున్న మునసా వీరబాబు (19) హఠాత్తుగా బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం రోడ్డుకం రైల్ బ్రిడ్జి నుంచి గోదావరిలో దూకేశాడు. పోలీసుల ద్వారా ఈ విషయం తెలుసుకుని, అతని కుటుంబ సభ్యులు హుటాహుటిన బ్రిడ్జి వద్దకు పరుగు తీశారు. వివరాల్లోకి వెళితే వీరబాబు లాలా చెరువులో ఆటో మొబైల్ షాపులో పని చేస్తున్నాడు. స్నేహితులతో కలసి బుధవారం ఉదయం రంపచోడవరం వెళ్లాడు. స్నేహితుడు వెంకీతో కలసి వీరబాబు రాత్రి రోడ్డు కం రైలు వంతెన పైకి వచ్చిన వెంటనే మోటారు సైకిల్ ఆపి తన చేతిలో ఉన్న సెల్‌ఫోన్ స్నేహితుడికి ఇచ్చి అతడు వారించినా ఆగకుండా ఒక్కసారిగా గోదావరి నదిలోకి దూకేశాడు. దీంతో స్నేహితుడు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఈ ఘటనతో రోడ్డు కం రైలు వంతెనపై ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి పొద్దుపోవడంతో యువకుడి కోసం నదిలో గాలించడానికి వీలు కాలేదు. వీరబాబు తండ్రి మునసా సత్యనారాయణ లారీ డ్రైవర్, తల్లి గృహిణి. వీరికి ఇద్దరు మగ సంతానం. పెద్ద కుమారుడు రాజమహేంద్రవరంలో ఒక అధికారికి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండోవాడైన వీరబాబు ఆటోమొబైల్ షాపులో పనిచేస్తున్నాడు.

లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడిగా మూర్తి

కడియం: జాతీయ బీసీ సంఘం లీగల్ సెల్ ఉపాధ్యక్షుడిగా తనను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నుంచి తనకు ఉత్తర్వులు అందాయని దండుబోయిన వీరవెంకటసత్యనారాయణ మూర్తి (గోకుల్ నర్సరీ మూర్తి) తెలిపారు. సదరు ఉత్తర్వులను తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, రాష్ట్ర ఇన్‌చార్జి వై.నూకాలమ్మల చేతుల మీదుగా అందజేశారన్నారు. సంఘం లక్ష్యాల మేరకు పనిచేస్తానని మూర్తి తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

రంగంపేట: ఎన్నికల వరకే రాజకీయాలని, తరువాత రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, నాయకులు అందరూ కలసికట్టుగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన బుధవారం బడ్జెట్‌పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమాలని ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ముందుగా మండస్థాయి అధికారులందరూ తమ శాఖల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సభ్యులందరూ బడ్జెట్‌ను ఆమోదించారు. కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్లు రాష్ట్రానికి ఆర్థిక సహాయం అందించిందన్నారు. ఈ నిధులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైస్ ఎంపీపీలు రాయుడు రాంబాబు, మట్టా శ్రీను, తహసీల్దార్ కోసు అనసూయ, ఎంపీడీఓ వి.వీరసాయిబాబు, ఈఓపీఆర్డీ పి.వెంకటరత్నం, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన విద్య




పెద్దాడలో శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారం, మెరుగైన విద్య అందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి తెలిపారు. పెద్దాడలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ, పడాయిబీపై రెండో రోజు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నరేంద్రరెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం దించడానికి తీసుకోవాల్సిన పోషకాహారంపై, అలాగే ప్రీస్కూల్ చిన్నారులకు నాణ్యమైన విద్య అందించడానికి శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. సచివాలయం కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీ గౌరీ, శ్రీపద్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

కడియం: రంజాన్ మాసం సందర్భంగా గ్రామంలో ఉన్న మస్జిద్-ఏ- కౌసర్ మసీదులో ముస్లింలు బాధ్యతా సేవా సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సంస్థ అధ్యక్షుడు గిరజాల బాబు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిరజాల బాబు మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేస్తూ, అల్లా దయతో అందరూ సుఖశాంతులతో, సహోదర భావంతో మెలగాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు బాధ్యత సేవా సంస్థ ద్వారా 21 ఏళ్లుగా ఇఫ్తార్ విందు ఇస్తున్న గిరజాల బాబు సేవలు అభినందనీయమన్నారు. కుల, మతాలకు అతీతంగా గిరజాల ఇఫ్తార్ విందు ఇవ్వడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. అనంతరం కడియం మసీదు కు స్థలం కొనుగోలు చేయుటకు సుమారు 20 లక్షల రూపాయలు పైబడి నగదును అందజేసినందుకు, విపత్తులు వాటిలినప్పుడు పేద ప్రజలను తమదైన శైలిలో సేవాభావంతో సేవలందిస్తున్న డాక్టర్ అజిమతుల్లా బేగ్‌ను మెమొంటో శాలువాతో సత్కరించారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తు చేసుకున్నారు. ముస్లిం పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు చీరలు దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మసీద్ – ఏ–కౌసర్ అధ్యక్షులు షేక్ సలీం , సర్కార్ భాష, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షులు ఏం.డి ఆరిఫ్,షటర్ బాషా, ఇబ్రహీం బాషా, తిరుమల శెట్టి శ్రీనివాస్, కానబోయిన సాగర్, కొండపల్లి పట్టియ్య, దాసరి శేషగిరి, కొత్తపల్లి శివాజీ, సాపిరెడ్డి సూరిబాబు, ఆకుల సుధాకర్, బాధ్యతా సేవా సంస్థ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.



అజిమతుల్లా బేగ్‌ను సత్కరిస్తున్న గిరజాల బాబు, యాదలస్టాలిన్ తదితరులు